క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



ఉమాదేవి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి

హిందూపురం: మండలంలోని మిట్టమీదపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాములు సతీమణి ఉమాదేవి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి మిట్టమీదపల్లి శ్రీరాములు స్వగృహానికి వెళ్లి ఉమాదేవి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యూ–విన్ యాప్‌పై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రీనివాసరెడ్డి

హిందూపురం టౌన్: ఆయూష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌కు అనుసంధానం చేసేందుకు రూపొందించిన యూ–విన్ యాప్ టీకాల కార్యక్రమం నిర్వహించడానికి అన్ని రకాలుగా ఉపయోగకరమైనదని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని లక్ష్మీపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో చిలమత్తూరు, కోడూరు, చౌళూరు, లక్ష్మీపురం ఆరోగ్య కేంద్రాలలో యూ–విన్ పోర్టల్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గర్భిణి మొదలు నవజాత శిశువు బిడ్డ, కౌమార స్థితి వరకూ టీకాలు పొందడానికి యూ–విన్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం యూ–విన్ కోఆర్డినేటర్ భాస్కర్ యాప్‌లో వివరాలు నమోదు చేయడం, యాప్‌ను నిర్వహించడం తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సర్వశ్రీ రామకృష్ణ, నిఖేష్, మంజుశ్రీ, చంద్రశేఖర్, సీహో ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

అమరాపురం: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ రామరావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా ఏపీ పనులు చేస్తున్నారు. ఎంతమంది కూలీలు పనులకు హాజరవుతున్నారు, తదితర వాటిని అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను అధికారులు రైతులు, కూలీలతో సమాశేం ఏర్పాటు చేసి పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతం రికార్డులు, మస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జగదీష్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వార్లు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మరువపల్లి గ్రామంలో వెలిసిన శ్రీరాముడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. అయోధ్యలో బాలరాముని విగ్ర ప్రతిష్టాన నిర్వహించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆలయంలో స్వామి వారికి వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వార్లకు పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

మిరప పంట పరిశీలన



శ్యాపురంలో ఎండు మిర్చిని పరిశీలిస్తున్న మంత్రి సవిత

రొద్దం: మండల పరిధిలోని శ్యాపురం గ్రామంలో బుధవారం రాష్ట్ర బీసీ, జౌళీశాఖ మంత్రి ఎస్ సవిత గ్రామాన్ని సందర్శించి మిరప పంటను పరిశీలించారు. మార్కెట్‌లో ఉన్న ధరలపై మిర్చీ రైతులతో అడిగి తెలుసుకున్నారు. అలాగే శ్యాపురం, కంబాలపల్లి గ్రామాల్లో పలు రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇస్తెమా ఏర్పాట్ల పరిశీలన

పెనుకొండ : పట్టణంలో ఫిబ్రవరి 5, 6 తేదీలో నిర్వహించనున్న ఇస్తెమా ఏర్పాట్లను మంత్రి సవిత బుధవారం పరిశీలించారు. అధికారులు, ముస్లిం నాయకులతో కలిసి కోనసురం రహదారి పక్క ఉన్న చింత తోపు వద్ద పోలం జేసీబీలతో శుభ్రం చేసిఉండగా పరిశీలించిన మంత్రి భక్తులకు త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం తదితర ఏర్పాట్లు చక్కగా ఉండేలా చాలడలని కోరారు.

అన్నదాతలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని బలంగా నమ్మిన మాజీ సీఎం వైఎస్ జగన్ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వారికి అన్ని విధాలా అండగా నిలిచారు. ఆ ఐదేళ్లూ సంతోషంగా పంటలు పడిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పరిస్థితులు మారాయి. రైతులు మళ్లీ అప్పల ఊబిలో చిక్కుకుంటున్నారు. ప్రభుత్వ సాయం అందకపోవడంతో అధిక వడ్డీలకు అప్పులు చేసి రబీ సాగుకు సిద్ధమవుతున్నారు.



సాగు చేసిన వేరుశనగ పంట

అప్పల ఊబిలో అన్నదాతలు



సాగు చేసిన వరి పంట

- పెట్టుబడి సాయం అందించని కూటమి ప్రభుత్వం
- వరుస నష్టాలతో రైతుల కుదేలు
- రబీలో పంటల సాగుకు అప్పు చేయాల్సిన దుస్థితి

మడకశిరరూరల్: గత ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు వేసిన పంటలన్నీ దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే బోరు బావుల కింద నీటి సౌకర్యం ఉన్న రైతులు ఖరీఫ్ నష్టాన్ని పూడ్చుకోవాలని రబీ పంటల సాగుపై ఆశలు పెట్టుకున్నారు. కానీ పంటల సాగుకు ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద రైతుకు రూ.20 వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చినా నేటికీ హామీ నిలుపుకోలేదు. దీంతో రబీ పంటల సాగుకు మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరులో నీరు ఉన్నా అప్పులు చేస్తే తప్ప పంటలను సాగు చేయలేమంటున్నారు.

తగ్గనున్న రబీ పంటల సాగు

ఈ ఏడాది అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల కూటమి ప్రభుత్వం రైతు ఖాతాల్లోకి జమ చేయకపోవడంతో ఆర్థిక సమస్య కారణంగా రబీ పంటల సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉంది. ఇప్పటి వరకు మడకశిర నియోజకవర్గంలో వేరుశనగ 872 హెక్టార్లు, వరి 162 హెక్టార్లు, మొక్కజొన్న 315 హెక్టార్లు, రాగి 241 హెక్టార్లు, పత్తి 96 హెక్టార్లు చొప్పున 1,686 హెక్టార్లలో పంటలు సాగు చేశారు.

గతంలో రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించి పంటల సాగును ప్రోత్సహించింది. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేసి ప్రతి ఖరీఫ్, రబీ పంటల సాగు సమయానికి రైతు ఖాతాలోకి రూ.13,500 పెట్టుబడి సాయం అందించారు. ఆర్బీకేల ద్వారా ఎరువులతో పాటు విత్తనాలు అందించేవారు. అలాగే ఉచిత పంటల బీమా రైతులకు భరోసానిచ్చేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేక పోవడంతో పంటల సాగుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి.



పెట్టుబడి సాయం ఇచ్చేదెన్నడు?

కూటమి నాయకులు ఎన్నికల ప్రచార సమయంలో అన్నదాత సుఖీభవ కింద రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇంకా పెట్టుబడి సాయం అందించలేదు. రూ.50 వేలకు పైగా అప్పు చేసి పంటలను సాగు చేశాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంటలకు సాగుకు అప్పులు చేయకుండా అందించే రైతు భరోసా సాయంతో పంటలను సాగు చేసేవాళ్లం.

– శ్రీరామరెడ్డి, రైతు ఎల్లోటి, మడకశిర మండలం



రూ.60 వేలు అప్పు చేశా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తోంది. ఎన్నికల్లో కూటమి నాయకులు చెప్పిన విధంగా పెట్టుబడి సాయం రూ.20 వేల ఇప్పటి వరకు ఖాతాలోకి జమ చేయలేదు. దీంతో ఖరీఫ్‌లో వేరుశనగ నష్టాన్ని రబీలోనైనా తీర్చుకోవాలని ఆశతో రూ.60 వేలకు పైగా అప్పులు చేసి రబీలో వేరుశనగ, వరి పంటలను 6 ఎకరాల్లో సాగు చేశాను. గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి ప్రోత్సహించడం లేదు.

– నరసింహమూర్తి, రైతు కదిరేపల్లి, మడకశిర మండలం

తక్షణమే నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న హిందూపురం శాఖ ప్రధాన కార్యదర్శి కె.రమేష్

హిందూపురం: ఎల్ఐసీలో చాలాకాలంగా పెండింగ్‌లో 2,700 పోస్టులను తక్షణం భర్తీ చేయాలని ఎల్ఐసీ హిందూపురంశాఖ ప్రధాన కార్యదర్శి కె.రమేష్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా హిందూపురంలోనూ ఆ సంఘం అధ్యక్షురాలు లోచర్ల చంద్రకళ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. రమేష్ మాట్లాడుతూ రెండేళ్లలో ఐదువేలకు పైగా సిబ్బంది సంఖ్య తగ్గిందని, రాబోయే రెండేళ్లలో పెద్ద సంఖ్యలో సిబ్బంది పదవీ విరమణ చేయనున్నారన్నారు. ఈ నేపథ్యంలో క్లాస్ 3, 4 కేడర్లలో తక్షణమే పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్మిక సంఘం నిబంధనల మేరకు తమ సంఘానికి తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధుసూదన్‌రావు, శ్రీలక్ష్మి ,మాధురి, మాధవి, నరసింహులు, నాగరాజు, మనీష్ ప్రీతం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామికి నిప్పు



మంటల్లో కాలిపోతున్న గడ్డివాము

గుడిబండ: తాగిన మైకంలో గడ్డి వాముకు నిప్పు అంటించిన ఘటన మండల పరిధిలోని గుడ్డదహళ్లిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైతుల వివరాల మేరకు.. గుడ్డదహళ్లికి చెందిన ఈరన్న, దేవరహట్టికి చెందిన మారన్న తమ వ్యవసాయ పొలంలోని దొడ్డిలో పశువుల మేత కోసం దాదాపు రూ.1.80 లక్షల విలువ చేసే గడ్డి నిల్వచేశారు. అటుగా వెళుతున్న గుడిబండ గ్రామానికి చెందిన రాజు తాగిన మైకంలో రెండు గడ్డి వాములకు నిప్పంటించాడు. రాత్రి సమయం కావడంతో గడ్డి వాము పూర్తిగా దగ్ధమైయింది. వెంటనే గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయతి న్ంచారు. అప్పటికే పూర్తిగా గడ్డివాము కాలిపోయింది. బాధిత రైతులు... రాజుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డితో భేటీ



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన దృశ్యం

మడకశిర: వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నూతనంగా నియమితులైన మడకశిరకు చెందిన ఏడీసీసీ బ్యాంక్ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి బుధవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని చిత్తూరు జిల్లాలోని వారి స్వగ్రామంలో కలిశారు. మర్యాద పూర్వకంగానే వారిని కలిసినట్లు ఆనందరంగారెడ్డి తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని వారు సూచించినట్లు తెలిపారు. మడకశిర నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ యువ నాయకుడు నితిన్‌రెడ్డి కూడా మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

ఇరిగేపల్లిలో పశు ఆరోగ్య శిబిరం



గొర్రెలకు మందు వేస్తున్న దృశ్యం

అగళి: మండల పరిధిలోని ఇరిగేపల్లి పంచాయతీలోని నందరాజనపల్లి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ.. పశువులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా శిబిరాలకు వచ్చే వైద్యులకు తెలియజేస్తే పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు. చూడి తనిఖీలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ పశువైద్య సిబ్బంది కృష్ణమోహన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి



హొన్నంపల్లిలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

పరిగి: రైతులు తమ పంట సాగులో సస్యరక్షణ పద్ధతులను అవలంభించడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి విజయభారతి తెలిపారు. బుధవారం మండలంలోని హొన్నంపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. గ్రామ రైతు పార్వతమ్మ సాగు చేసిన కంది పంటలో చేసిన ప్రయోగాలతో అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏఏ హరీష్, బీమా కంపెనీ కోఆర్డినేటర్లు అశోక్, నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణంతో విద్యుత్ సమస్యలకు చెక్



గొళాపురంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం: నియోజకవర్గంలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్లతో విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గొల్లపురం, కిరికెర మోతుకుపల్లి గ్రామాల్లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. గొళాపురంలో ఏపీఐఐసీ గ్రోత్‌సెంటర్ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో మరో పది సబ్‌స్టేషన్లు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బాలకృష్ణ తెలిపారు. త్వరలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కింద రూ.92 కోట్లు, అలాగే హెచ్ఎన్ఎస్ మరమ్మతులు, పైప్‌లైన్లకు రూ.120 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయనుందన్నారు. చిలమత్తూరు, గోరంట్ల ఎత్తిపోతల పథకం కూడా ప్రత్యేక నిధులు రానున్నాయన్నారు.

కుష్టుపై ఇంటింటి సర్వే

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని అంబేడ్కర్ నగర్‌లో కుష్టు వ్యాధిపై వైద్య సిబ్బంది బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. కుష్టు వ్యాధిని ముందుగా గ్రహిస్తే నిర్మూలించడానికి సాధ్యం అవుతుందని వైద్యుడు ఓంకార్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నూతన రైల్వే బ్రిడ్జిపై చీకట్లు



రైల్వే వంతెనపై వెలగని విద్యుత్ లైట్లు

పెనుకొండ రూరల్: పట్టణ సమీపంలో రైల్వేస్టేషన్ సమీపంలో దాదాపుగా రూ.25 కోట్లు వెచ్చించి వంతెన నిర్మించారు. ఇటీవలే వంతెనను ప్రారంభించారు. అది ప్రారంభించి నెల కూడా గడవకనే విద్యుత్ లైట్లు చెడిపోయాయి. దీంతో బ్రిడ్జిపై చీకటి కమ్ముకుంది. విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలీని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెంకటస్వామికి ఘన నివాళి



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని కంచి కామాక్షి కళ్యాణ మండపంలో బుధవారం ప్రభుత్వాస్పత్రి కమిటీ మాజీ చైర్మన్ జె.వెంకటస్వామి సంతాపసభను నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ సాధుచెట్టి సంఘం అభ్యున్నతికి ఎంతో కృషిచేశారని కొనియాడారు. జేవీఎస్ ఎడ్యుకేషన్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థుల చదువుకు సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఎంఈఓ గంగప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, బాలాజీ మనోహార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలి

రొళ్ల: ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ముందుగా డీడీలు చెల్లించిన వారికి సీనియారిటీ ప్రకారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో ఆ శాఖ అధికారులను కోరారు. కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్న వారికి సీనియార్టీని పక్కన పెట్టి ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తున్నట్లు తెలిసిందన్నారు. ముందుగా డీడీలు చెల్లించిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని, లేకపోతే రైతులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు.

నిరాశ్రయులకు దుప్పట్లు, స్వెటర్ల పంపిణీ

హిందూపురం: పట్టణ పరిసరాల్లో నివాసాలు లేక అనాథలుగా రహదారులు, బస్టాండ్, రైల్వేస్టేషన్ వద్ద కాలం గడుపుతున్న నిరాశ్రయులకు దాతల సహకారంతో లైఫ్ వరల్డ్ స్వచ్ఛంద సంస్థ రెండో రోజూ దుప్పట్లు, స్వెటర్లులను పంపిణీ చేశారు. ఆ సంస్థ నిర్వాహకుడు ఉదయ్‌కుమార్, మింటూ, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, శ్యామ్ బాబు, బన్నీ, శివా, రాకేష్ , జోషి తదితరులు పట్టణ పరిసర ప్రాంతాల్లో నిరాశ్రయులను గుర్తించి దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లేపాక్షి: లేపాక్షిలోని వెలుగు కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, డివిజన్, గ్రామస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

క్షయవ్యాధిపై అవగాహన

హిందూపురం: హిందూపురం రైల్వే క్వాటర్స్‌లో రైల్వే మెడికల్‌శాఖ క్షయవ్యాధిపై అవగాహన కల్పించింది. రైల్వే యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రతిమ అధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. టీబీ వ్యాధి లక్షణాలు, చికిత్స ఎలా తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయక్ పాల్గొన్నారు.

జాతరకు ఆహ్వానం

పెనుకొండ: గుత్తిలోని మునుమ జాకిని అమ్మవార్ల జాతరకు రాష్ట్ర మంత్రి సవితను స్థానిక కాటిక సంఘం నాయకులు బుధవారం ఆహ్వానించారు. మంత్రి సవిత క్యాంపు కార్యాలయంలో ఆమెను కలసిన కాటిక సంఘం నాయకులు ఉత్సవానికి రావాలని ఆహ్వానించారు. 6, 7 తేదీల్లో జాతర జరుగుతుందన్నారు. అనంతరం కరపత్రాలను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

శిరివరంలో వేలం పాట

లేపాక్షి: మండలంలోని శిరివరం–మానేపల్లి చెరువులో చేపలు పట్టుకునేందుకు శిరివరం గ్రామ పంచాయితీ కార్యాలయంలో బుధవారం ఉదయం వేలం పాట నిర్వహించారు. వేలంలో 10 మంది పాల్గొనగా అందులో కిష్టప్ప అనే వ్యక్తి రూ.2.10 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నేత్రావతి, ఈఓఆర్డీ ఆనంద్‌కుమార్, కార్యదర్శులు సాయిప్రసాద్, మల్లికార్జునతో పాటు వేలం పాటదారులు పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తి చేయించండి



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ ఏపీడీ

రొళ్ల: ఉపాధి, పశువైద్యశాఖ సంయుక్తంగా మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించడానికి చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఏపీడీ లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం మండలానికి 43 గోకులం షెడ్లు మంజూరైనట్లు చెప్పారు. ఒక్కో షెడ్డు విలువ రూ.2.20 లక్షలు చొప్పున నిధులు కేటాయించామని, అయితే ఇప్పటి వరకు ఐదారు గోకులం షెడ్లు మాత్రమే పూర్తయినట్లు తెలిసిందన్నారు. మిగిలిన షెడ్ల నిర్మాణాలను ఈనెలాఖరులోపు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఓబుళప్ప, జేఈ మారేగౌడు, టీఏలు, సీఓలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో సర్వధర్మ సమ్మేళనం



సర్వధర్మ సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని జ్ఞానయోగకళా మందిరంలో బుధవారం సర్వధర్మ సమ్మేళనం, 25వ రజతోత్సవ వేడుకలు జరిగాయి. మడకశిర కేంద్రం ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈసమ్మేళనాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని మతాలకు చెందిన పెద్దలు పాల్గొనితమ సందేశాన్ని ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, భూమానందస్వామి, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ధాన్ ఫౌండేషన్ వార్షికోత్సవం

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామం చౌడేశ్వరి దేవాలయంలో ధాన్ ఫౌండేషన్ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మహిళా కళంజియం సభ్యులు సుమారు వెయ్యి మంది పూర్ణ కుంభ కలలలశాలతో గ్రామం ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ధాన్ ఫౌండేషన్ నిర్వాహకుడు అల్మూరప్ప మాట్లాడుతూ బ్యాంకుల నుంచి సుమారు రూ.28 కోట్ల రుణాలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించి సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేశామన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్ తనిఖీ



కోగిరలో సబ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి

రొద్దం: మండల పరిధిలోని కోగిర సబ్‌సెంటర్‌ను జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌లో పలు రికార్డులు పరిశీలించారు. అక్కడికి వచ్చిన గర్భిణులకు టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు గిరిధర్‌రావు, బేబిరాణి, ఆరోగ్య సహాయాలకు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.